రుణమాఫీ సంబురాలు

- సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

వనపర్తి జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ, జూలై 18 : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం మొదటి విడుతగా లక్షలోపు రైతుల రుణాలను మాఫీ చేయడంతో గురువారం జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లోని ఆయా మండల కేంద్రాలు, గ్రామాల్లో రైతులు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేస్తూ సంబురాలు చేసుకున్నారు. వనపర్తి జిల్లా కేంద్రం, గోపాల్‌పేట మండల కేంద్రాల్లో ప్రణాళికాసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పార్టీ నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అలాగే అమరచింత, ఆత్మకూరు మండలాల్లో నిర్వహించిన సంబురాల్లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొని సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రైతు సంబురాల్లో భాగంగా అమరచింతలో ఏడ్ల బండ్ల ర్యాలీ, ఆత్మకూరులో బైక్ ర్యాలీ నిర్వహించారు. గద్వాలలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత వేర్వేరుగా తన అనుచరులతో సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు.

ప్రతిఎకరాకూ సాగునీరు అందించడమే లక్ష్యం

గోపాల్‌పేటలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి

- ఎమ్మెల్యే మేఘారెడ్డి

గోపాల్‌పేట, జూలై 18 : నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని, మరో రెండు రోజుల్లో గుడిపల్లి రిజర్వాయర్ నుంచి సాగు నీటిని విడుదల చేస్తామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన రేవల్లి మండలంలోని గౌరిదేవిపల్లి సమీపంలోని గుడిపల్లి రిజర్వాయర్‌ను సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటికే ఆల్మట్టి, నారాయణపూర్ గేట్లు ఎత్తడంతో జూరాల ప్రాజెక్టుకు నీటి తాకిడి భారీగా పెరిగిందని నేడో, రేపో జూరాల గేట్లు ఎత్తిన అనంతరం గుడిపల్లి నుంచి సాగు నీరు విడుదల అవుతుందన్నారు. గుడిపల్లి రిజర్వాయర్ వద్ద ఉన్న సమస్యలకు సంబంధించి ప్రతి పాదనలు తయారుచేసి ఇవ్వాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అంతకు ముందు ఆయన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డితో కలిసి గోపాల్‌పేట, రేవల్లి మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.ఆయా కార్యక్రమాల్లో సింగిల్‌విండో చైర్మన్ రఘుయాదవ్, ఏవో అనిల్‌కుమార్, తాసీల్దార్ తిలక్ కుమార్‌రెడ్డి, లక్ష్మీదేవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.రాజేంద్రప్రసాద్, ఉమ్మడి మండల పార్టీ ఇన్‌చార్జి మంద సత్యశీలారెడ్డి, నాయకులు అచ్యుత రామారావు, లోకారెడ్డి, శాంతన్న, శివ న్న, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, నరహరి, గోవర్ధన్‌రెడ్డి, సుధాకర్‌రావు, ఎల్లగౌడ్, వెంకటయ్య, శేఖర్, లక్ష్మణ్, దేవరాజు పాల్గొన్నారు.

రేవల్లి సీహెచ్‌సీ పరిశీలన

గోపాల్‌పేట, జూలై 18 : రేవల్లి మండలకేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను గురువారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పరిశీలించారు. దవాఖానలో శిథిలావస్థకు చేరిన గదులను పరిశీలించారు. వాటి పటిష్టతకు కావాల్సిన చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. దవాఖానను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు.

గోరింటాకు సంబురం

గోరింటాకు వేడుకలో పాల్గొన్న మహిళలు

పెబ్బేరు, జూలై 18 : ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకుంటే అంతా మంచే జరుగుతుందన్న నమ్మకం అనాధిగా వస్తోంది. ముఖ్యంగా పెళ్లయిన మహిళలకు సౌభాగ్యం కలుగుతుందని, పెండ్లి కాని వారికి మంచి భర్త వస్తాడని భావిస్తారు. ఈ మాసంలో మాత్రం మార్కెట్‌లో రెడిమేడ్‌గా దొరికే మెహెందీల జోలికి పోకుండా, సాంప్రదాయంగా చెట్టు నుంచి గోరింటాకును సేకరించి రుబ్బుకొని.. సామూహికంగా ఓ వేడుకగా మహిళలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలోనే వనపర్తి జిల్లా పెబ్బేరులో గురువారం కొందరు మహిళలు రెండు చేతులకు గోరింటాకు పెట్టుకొని మురిసిపోయారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
★ I, RAMESHWARAMMA W/o DANDU KRISHNA REDDY, Passport No: Y 9235672, R/o: 3-16, Kandur Village. Addakal Mandal. Mahabub Nagar - 509382. Changed My Name As DANDU RAMESHWARAMMA
NT-MBNR

CHANGE OF NAME
I, K. SRINIVAS S/o K. VENKATAIAH, LLB., Advocate, shall henceforth be known as KADIYALA SRINIVAS REDDY S/o KADIYALA PEDDA VENKATIAH, for the purpose of correction of wrong entires occurred in school records due to parental mistake. K. SRINIVAS, Ph: 8790421430, Telangana Gazette.

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

OLD AGE HOME
★ ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం|| చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325763-AII

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేస్తా

- ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

చిన్నంబావి, జూలై 18 : ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేస్తానని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండలకేంద్రంలో రూ.31లక్షలతో నిర్మించిన విద్యా వనరుల భవనాన్ని, వెల్టూరు గ్రామ ప్రాథమిక పాఠశాలలో రూ.14.75లక్షల వ్యయంతో అమ్మ ఆదర్శ పాఠశాల భవనాలను గురువారం ఆయన ప్రారంభించారు. అదేవిధంగా కస్తుర్బాగాంధీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వెల్టూరు పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ఇప్పటికే మౌలిక వసతుల కల్పన పూర్తయిందని, ప్రతి పాఠశాలలో తాగునీరు, టాయిలెట్స్, విద్యుత్ తదితర వసతులను ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు, మౌలిక వసతులను కల్పిస్తుందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా వెల్టూరు హైస్కూల్, ప్రైమరీ స్కూల్ వసతుల కల్పనకు రూ.20లక్షలు, అయ్యవారిపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు రూ.15లక్షలు, కస్తుర్బాగాంధీ పాఠశాలకు రూ.25 లక్షల నిధులను మౌలిక వసతుల కల్పనకు కేటాయిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో చదివే 1600 మంది విద్యార్థులకు ఇంగ్లిష్ డిక్షనరీలు ప్రతి విద్యార్థికి అందించేందుకు ఎన్ఆర్ఐ కొత్త కల్యాణ్‌కుమార్‌కు రూ.2.40లక్షలను మంత్రి అందజేశారు. అంతకుముందు పాఠశాలల్లో విద్యార్థులు పెరగడానికి కృషి చేసిన, విద్యా వలంటీర్లను ఏర్పాటు చేసిన వారికి సొంత డబ్బులు సమకూర్చుతున్న ఎన్నారై కొత్త కల్యాణ్‌కుమార్‌ను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజ్, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, సింగిల్ విండో చైర్మన్ బగ్గారి నర్సింహారెడ్డి, హెచ్ఎంలు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు చిదంబర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, కృష్ణప్రసాద్‌యాదవ్, బీచుపల్లియాదవ్, తేజరెడ్డి, రంజిత్, గంగారి శ్రీను, జగదీశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

రైతు రుణమాఫీ అమలుకు పకడ్బందీ చర్యలు

- కలెక్టర్ సంతోష్

మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

గద్వాల, జూలై 18 : రైతు రుణమాఫీ అమలుకు ప్రత్యేక పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సంతోష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ శాఖ, సహకారశాఖ, లీడ్ బ్యాంక్ మేనేజర్‌లతో కలిసి రైతు రుణమాఫీ పథకం కార్యక్రమంపై , తీసుకోవాల్సిన చర్యలుపై కలెక్టర్ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు రుణమాఫీ కార్యక్రమం జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 24,398 మంది రైతులు, 23,548 రైతు కుటుంబాలకు రూ.144 కోట్ల రుణమాఫీ వర్తిస్తుందన్నారు. జిల్లాలోని బ్యాంకులు, సహకార శాఖద్వారా రైతులకు నేరుగా వారి ఖాతాలలో రుణమాఫీ సొమ్ము జమవుతుందన్నారు. రుణమాఫీ కోసం వచ్చే రైతులకు పూర్తిగా సహకరిస్తూ వారికి బ్యాంకర్లు, వ్యవసాయ, సహకార శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి సహకరించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్య వసాయశాఖ అధికారి గోవింద్‌నాయక్, డీసీవో ప్రసాద్‌రావు, ఎల్డీం అయ్యపురెడ్డి బ్యాంకర్లు, అధికారులు పాల్గొన్నారు.

శంకర సముద్రం రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

కొత్తకోట,జూలై18: కొత్తకోట మండలంలోని శంకరసముద్రం రిజర్వాయర్ నుంచి గురువారం కాంగ్రెస్ నాయకులు నీటిని విడుదల చేశారు. దీంతో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కొత్తకోట, కానాయపల్లి, నిర్వేన్,రామనంతపురం, దంతనూరు, తిరుమలాయపల్లె తదితర గ్రామాల రైతులకు ఈ సాగునీరు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, నరేందర్‌సాగర్, రాములు పాల్గొన్నారు.

పేద విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం

కొత్తకోట,జూలై 18: మండలంలోని వడ్డెవాట గ్రామానికి చెందిన బొగ్గు నవీన్‌కుమార్‌కు ఐఐటీలో సీటు రావడంతో చదువు కోసం గురువారం రూ. 20వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అందజేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ వెంకటన్నకు అనారోగ్యానికి గురి కావడంతో అతనికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భాను ప్రకాశ్‌రెడ్డి, రాజు, రాంలాల్‌నాయక్, తిరుపతి, నారాయణ, శ్రీను, రాములు, వెంకటయ్య ఉన్నారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

ఉండవెల్లి, జూలై 18 : నిలిపి ఉన్న కారును వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో మరో కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆయన కథనం ప్రకారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌కు చెందిన అమీన్డ్దీన్ షరీఫ్ ఉండవెల్లి మండలం బైరాపురం గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమిని చూసేందుకు కారును బయలుదేరి కారును రోడ్డు కింద నిలిపివెళ్లాడు. మహబూబ్ నగర్‌కు చెందిన కారు వేగంగా వచ్చి నిలిపి ఉన్న కారును ఢీకొన్నది. దీంతో రెండు కార్లు దెబ్బతిన్నాయి. అమీన్డ్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ చెన్నయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎరువుల దుకాణం ప్రారంభం

మల్దకల్, జూలై 18 : మండలకేంద్రంలోని మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం రైతుల కోసం ఎరువుల దుకాణం ప్రారంభించారు. జోగుళాంబ ఉమెన్ ఫార్మర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మన గ్రోమోర్ ఫర్టిలైజర్ అందుబాటులో ఉందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.కార్యక్రమంలో సీసీలు, జయన్న, తిమ్మరాజు, సలోమి, రవికుమార్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

గద్వాల అర్బన్, జూలై 18 :జిల్లాలో ప్రథమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఉన్న 18 నుంచి 30 ఏండ్ల వయస్సు గల నిరుద్యోగులకు ఉచితంగా ఎలక్ట్రీషన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రియాంక గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. 30 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ,ఐటీఐ చదివిన వారు అర్హులు. వివరాలకు 6303430789,7671844901 నెంబర్లకు కాల్ చేయాలని సూచించారు.

ఘనంగా ఆలయ ఉత్సవాలు

గద్వాలటౌన్, జూలై 18 : జిల్లా కేంద్రంలోని రాజవీధిలోని మార్కండేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ జరిగి యాభై ఏండ్లు పూర్తయిన సందర్భంగా పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలో పుణ్యాహ వాచనం, కలశస్థాపన, పూర్ణాహుతి, మహాగణపతి హోమం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పద్మశాలీలు బైక్ ర్యాలీ నిర్వహించి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. అలాగే సాయంత్రం స్వామి సన్నిధిలో భజన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం, యువజన సంఘం నాయకులు పులిపాటి వెంకటేశ్, శ్రీనివా సులు, శ్రీకాంత్, శ్రీనివాసులు, శాంతారాం, రామకృష్ణ, నరహరిశ్రీనివాసులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలే జీవనాధారం

అయిజ, జూలై 18 : మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమని జీహెచ్ఎం రాములు అన్నారు. గురువారం పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జీహెచ్ఎం మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కల పెంపుతో స్వచ్ఛమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ బృందాలతో మొక్కల పెరుగుదలకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

మహిళా సంఘాలకు రుణ ప్రోత్సాహం అందించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్

బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి, జూలై 18 : జిల్లాలోని మహిళా సంఘాలకు విరివిగా రుణాలు అందించి ప్రోత్సహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ బ్యాంక్ ప్రతినిధులకు సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లాలోని ఎస్‌హెచ్‌జీ లింకేజీపై బ్యాంకు అధికారులతో సమీక్షా సమావేశం కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 ఏడాదికి సంబంధించి జిల్లాలోని 4,282 సంఘాలకు రూ.267.99కోట్ల వడ్డీలేని రుణాలు అందించడం హర్షించదగిన విషయమన్నారు. మహిళా సంఘాలకు రుణాలు అందించడంలో బ్యాంకర్ల సాయం అభినందనీయమైందన్నారు. అలాగే 2024-25 ఏడాదికి ప్రభుత్వం 5,875 సంఘాలకు రూ.320.41కోట్ల లక్ష్యంగా ఇచ్చారని, అందుకు గానూ ఇప్పటి వరకు 431సంఘాలకు రూ.39.66కోట్లు అందజేశారని, రాబోయే రోజుల్లో మహిళా సంఘాలకు విరివిగా వ్యవసాయ అనుబంధ, ఎంటర్ ప్రైజెస్‌కి ఎస్‌హెచ్‌జీ బ్యాంక్‌లోన్ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్డీవో ఉమాదేవి, అదనపు డీఆర్డీవో భీమయ్య, ఎల్‌డీఎం కౌశల్ కిశోర్ పాండే, అసిస్టెంట్ ఎల్ డీఎంసాయికుమార్, డీపీఎంలు బాష్య నాయక్, రాములు, వివిధ బ్రాంచ్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలో రాణించి ఉద్యోగాలు సాధించాలి

- అదనపు కలెక్టర్ నగేశ్

నిరుద్యోగులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న దృశ్యం

వనపర్తి టౌన్, జూలై 18 : నిరుద్యోగ యువత గ్రూపు-2,3 పోటీ పరీక్షల మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని అదనపు కలెక్టర్ నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల ఆవరణలో మిరాశిపల్లి సాయమ్మ తృతీయ వర్ధంతిని పురస్కరించుకొని సాయమ్మ-బుచ్చన్న (సా-బు) చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పద్మారాణి ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు గురువారం గ్రూపు-2,3 మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు సాబు ట్రస్ట్ ద్వారా అందించిన మెటీరియల్ ఎంతో ఉపయో గపడుతుందని, మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షలో రాణించి ఉద్యోగాలు సాధించి వనపర్తికి మంచి పేరు తేవాలన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యకు అందిస్తున్న ప్రోత్సాహం ఎంతో అభినందనీయమని అందుకు ట్రస్ట్ చైర్మన్, డైరెక్టర్‌ను అభినందించారు. అదేవిధంగా డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో పలు పోటీ పరీక్షలకు మెటీరియల్‌ను అందించామని, గ్రూపు-2,3 మెటీరియల్‌ను అభ్యర్థులకు విజేత కాంపిటీషన్స్, ఇతర పబ్లికేషన్ల సహకారంతో మెటీరియల్‌ను సిద్ధం చేసి అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ స్వప్న, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, సాయమ్మ కుటుంబ సభ్యులు రాములు యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, సతీశ్‌యాదవ్, కళాశాల అధ్యాపకులు, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

సీఎం వీసీలో పాల్గొన్న కలెక్టర్లు, ఎమ్మెల్యేలు

గద్వాల,జూలై18: రైతు రుణమాఫీ 2024 నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వీసీ ద్వారా రైతులతో భేటీ అయ్యారు. కార్యక్రమంలో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, డీఏవో గోవింద్‌నాయక్, ఎల్ఎండీ అయ్యపురెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధులు,రై తులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేసి,ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్నారు.

ధరూర్‌లో వీసీలో పాల్గొన్న కలెక్టర్,ఎమ్మెల్యే

శ్రీరంగాపురంలో వనపర్తి కలెక్టర్

పెబ్బేరు, జూలై 18 : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రైతు రుణ మాఫీ ప్రక్రియలో భాగంగా గురువారం శ్రీరంగాపురంలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పాల్గొన్నారు. స్థానిక రైతు భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన రైతులతో కలిసి వీసీ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని తిలకించారు. ఆయనతో పాటు డీఏవో సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను రైతులు సన్మానించారు.

ఉండవెల్లి మండలంలో..

ఉండవెల్లి జూలై 18 : ఉండవెల్లి మండలకేంద్రంలోని రైతువేదికలో రైతు రుణమాఫీ పథకం నిధుల విడుదలపై సీఎం నిర్వహించిన వీసీకి ఎమ్మెల్యే విజయుడు ముఖ్యఅతిథిగా హాజరై సీఎం సందేశాన్ని తిలకించారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, ఎస్‌బీఐ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ క్రైం డీఎస్పీ రత్నం

గోపాల్‌పేట, జూలై 18 : ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ క్రైం డీఎస్పీ రత్నం ఆధ్వర్యంలో గురువారం ఏదుల మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామస్తులకు సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. రుణమాఫీ పథకం నేపథ్యంలో కొందరు సైబర్ నేరస్తులు బ్యాంకుల పేరిట వాట్సాప్‌కు లింక్‌లు పంపిస్తుంటారని దీనిని ఓపెన్ చేస్తే మన వాట్సాప్ వాళ్ల కంట్రోల్‌కి వెళ్లి గూగుల్ పే, ఫోన్‌పే, డబ్బులు దోచేస్తున్నారన్నారు. ఎవరైనా ఏదైనా నేరానికి గురైతే ఆలస్యం చేయకుండా 1930కి కాల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై హరిప్రసాద్, సైబర్ క్రైం కానిస్టేబుల్ విజయ్ పాల్గొన్నారు.

గద్వాల జిల్లా కేంద్రంలో..

గద్వాల అర్బన్,జూలై 18 : ఎప్పటికప్పుడు కొత్త కొత్త మార్గాల్లో జరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో సీఐ రాజు పేర్కొన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తోట శ్రీనివాసరావు ఆదేశాలకు మేరకు జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్‌స్టేషన్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంలో మాట్లాడుతూ ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే తక్షణమే 1930 సమాచారం అందించాలని సూచించారు. అలాగే సైబర్ మోసాలు వివిధ రకాలుగా బ్యాంక్ సంబంధించి ఓటీపీ , లింక్‌లు పంపుతారని అలాంటి సమయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌ల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చిన్నంబావి, జూలై 18 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పబ్బతి రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని వెల్టూరు గ్రామంలో ఎస్పీ ఆదేశానుసారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాట్సాప్ , ఫోన్ కాల్ ద్వారా కానీ ఆధార్ నంబర్, అకౌంట్ నెంబర్ వివరాలు అడిగితే చెప్పవద్దని, అలాంటి కాల్ వస్తే నేరుగా బ్యాంకును సంప్రదించాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైనట్లయితే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై రమేశ్, కానిస్టేబుల్ కరుణాకర్, మహేందర్, లక్ష్మణరావు ఉన్నారు.

అలంపూర్ చౌరస్తాలో ఎమ్మెల్యే విజేయుడికి వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

ఎమ్మెల్యేకు ఆశ కార్యకర్తల వినతి

ఉండవెల్లి, జూలై 18 : మండలంలోని అలంపూర్ చౌరస్తాలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే విజయుడికి నియోజకవర్గంలోని ఆశ కార్యకర్తలు వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు రూ.18వేల వేతనంతోపాటు ఉద్యోగ భద్రతను కల్పించాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే ఆశ కార్యకర్తల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఉండవెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కొండన్న అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకొని ఇంటికి వెళ్లి పరామర్శించారు.

ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

గద్వాల,జూలై18: ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతం రూ.18 వేలు ఇచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని గురువారం జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆశ వర్కర్లు ఎమ్మెల్యేబండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశామని యూనియన్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పద్మ, సునీత తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని, హామీల మేరకు ఆశలకు రూ.18వేల వేతనం ఇవ్వడంతోపాటు వారికి నిర్వహించే పరీక్ష రద్దు చేయాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. వీరికి జిల్లా కార్యదర్శి నర్సింహ మద్దతు తెలిపారు.కార్యక్రమంలో నాగప్రమీల, పద్మ, కాంతమ్మ, నరసమ్మ, మాధవి, శ్రీదేవి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అన్యాయం చేయొద్దు

వనపర్తి టౌన్, జూలై 18 : ప్రజల ఆరోగ్యం కోసం అహర్నిశలు పాటుపడే తమకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేయకుండా అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆశ కార్యకర్తలు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు గురువారం వనపర్తిలోని పాలిటెక్నిక్ కళాశాల నుంచి ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పారితోషికాలు పెంచాలని, ఆశాలకు నష్టం కలిగించే పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ప్రతి నెల 2వ తేదీన వేతనాలు చెల్లించాలని, ఇన్సూరెన్స్ రూ.50లక్షలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు చెల్లించాలని, ప్రతి సంవత్సరం 20రోజులు వేతనాలతో కూడిన మెడికల్ సెలవులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ చైర్మన్ మహేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, జిల్లా సహాయ కార్యదర్శి రమేశ్, ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బుచ్చమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి సునీత, జిల్లా ఉపాధ్యక్షురాలు భాగ్య, గిరిజ, దేవమ్మ, అనసూయ, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు రాములు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

డీఏ, పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

వనపర్తి టౌన్, జూలై 18 : పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే మంజూరు చేయాలని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పార్వత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఎస్టీయూటీఎస్ నేతలు సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల మెడికల్ బిల్లులు, సరెండర్ సెలవులు, పీజీఎస్, పార్ట్ ఫైనల్ లోన్‌లను సకాలంలో చెల్లించకపోవడంతో ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులకు గురువుతున్నారన్నారు. సమావేశంలో ఎస్టీయూటీసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరాలు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ హరిప్రసాద్, మండల బాధ్యులు వెంకటేశ్వర్లు, శివ శంకర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, జూలై 18 : తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రూపు-2 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు ఆగస్టు 1,2 తేదీల్లో మాక్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పద్మావతి గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు మైనార్టీ వర్గానికి చెందిన ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు , పారశీక అభ్యర్థులు క్యూఆర్ స్కానర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. ఆగస్టు 1న ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్ 1, మధ్యాహ్నం 2నుంచి 4.30గంటల వరకు పేపర్ 2, ఆగస్టు 2న 10నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్ 3, మధ్యాహ్నం 2నుంచి 4:30 గంటల వరకు పేపర్ 4 మాక్ పరీక్ష ఉంటుందని వివరాలకు 7207854914 నెంబర్‌కు సంప్రదించాలని ఆమె కోరారు.

గద్వాలలో..

గద్వాల అర్బన్, జూలై 18 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కాలేజీల్లో 2024-25,2025-26 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లలో రెండో విడుత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ సత్యనారాయణ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 9110523925, 9885249516 నెంబర్లు సంప్రదించాలని సూచించారు.

మల్దకల్ మండలంలో..

మల్దకల్, జూలై 18 : మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జంతుశాస్త్రం బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్ట్ ఖాళీ ఉందని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఇంటర్ విద్యానోడల్ అధికారి హృదయరాజు అన్నారు. పీజీలో 50శాతం మార్కులతో పాసై ఉండాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను జిల్లాకేంద్రంలోని ఇంటర్ విద్యా నోడల్ ఆఫీసర్ కార్యాలయంలో ఈనెల 22తేదీ సాయంత్రం 5గంటల వరకు అందజేయాలని కోరారు.

ఏపీవోగా బాధ్యతల స్వీకరణ

ఉండవెల్లి జూలై 18 : మండలకేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీవోగా సౌజన్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సుజాత గద్వాల జిల్లా మల్దకల్ మండల ఏపీవోగా బదిలీ అయ్యారు.